క్లుప్తంగా

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



కల్వకుర్తిరూరల్: గుండూరు గ్రామానికి చెందిన తిరుపతయ్యకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.22 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి బాధితుడికి గురువారం చెక్ అందజేశారు. అన్ని వైద్య చికిత్సలు రాజీవ్ ఆరోగ్య శ్రీలో చేర్చి ప్రజలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగులునాయక్, సుభాష్, సతీష్, సైదులుగౌడ్, నర్సింహ, సుమన్‌నాయక్, గణేష్ తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్ గ్రామానికి చెందిన 15 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మొత్తం రూ. రూ.6,15,000 లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు శివకుమార్ రావు గురువారం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, మాజీ సర్పంచ్ పద్మ, సత్యనారాయణ, గోపాల్‌రావు, అర్జున్, వెంకటరమణ పాల్గొన్నారు.

రేపు డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ

కొల్లాపూర్: పట్టణంలో 24వ తేదీన డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించనున్నట్లు రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ హాజరవుతారని తెలిపారు. యువత అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పెద్దకొత్తపల్లి: కస్తూర్బాగాంధీ పాఠశాలలో బాలికలకు గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌ఓ శ్రీనివాసులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గదుల్లో దోమలు రాకుండా మందును స్ప్రే చేయించారు. అనంతరం విద్యార్థులతో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ లత, వైద్య సిబ్బంది మల్లికార్జున్, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి చేపపిల్లల విడుదల



మన్ననూర్: స్థానిక చింతలచెరువులోకి గురువారం ముదిరాజ్ యువకులు చేపపిల్లలను వదిలారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి అధికస్థాయిలో నీరు చేరడంతో చేపపిల్లలను వదిలినట్లు యువకులు నరేష్, మల్లేష్ తెలిపారు. ప్రభుత్వ సహకారం అందించిందని పేర్కొన్నారు. బోడయ్య, శేఖర్ కాంగ్రెస్ నాయకుడు రాజారాం తదితరులు పాల్గొన్నారు.

తక్కువ బరువు ఉన్న పిల్లలను గుర్తించాలి

లింగాల: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించాలని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో సూపర్‌వైజింగ్ సప్లిమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాం అమలులో భాగంగా పిల్లలు బరువు, వారి పోషణపై టీచర్లకు ఒక రోజు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో వైద్యాధికారి శివశంకర్ మాట్లాడుతూ తక్కువ బరువు ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గిరిజ, టీచర్లు పాల్గొన్నారు.

పోలీసు వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు



నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని తూడుకుర్తి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో పోలీసు వాహన డ్రైవర్లకు ఎస్పీ రఘునాథ్ వైభవ్ గైక్వాడ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 25 మంది డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాఘవారావు, పోలీసు సిబ్బంది, ప్రేమ్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.



ఉప్పునుంతలలో హాజరైన అధికారులు



పెంట్లవెల్లి మండలం మాధవస్వామినగర్‌లో

పర్యావరణాన్ని రక్షించుకుందాం

అచ్చంపేట: పర్యావరణాన్ని రక్షించుకుందామని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. నాటుదాం ఒక చెట్టు– అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని మైనార్టీ గురుకులంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్టుంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. వసతి గృహంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, ఆకుల వెంకటేష్, రాజేష్, కటకం రఘురాం, ఖాదర్ పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో నాటుదాం ఒక చెట్టు– అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ ఆంజనేయులు మొక్కలు నాటి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంపీఓ చంద్రశేఖర్, ఏపీఓ ఇమాం అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మాధవస్వామినగర్‌లో పల్లెప్రకృతి దగ్గర ఎంపీడీఓ ప్రభాకర్ మొక్కలు నాటి మాట్లాడారు. పంచాయతీ సెక్రెటరీ శ్రావణ్, కృష్ణమోహన్, హుస్సేన్, రాము, బాలకృష్ణలు పాల్గొన్నారు.



అచ్చంపేట మైనార్టీ గురుకులంలో మొక్కకు నీరుపోస్తున్న మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు

ఉప్పునుంతల: స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఏఓ రమేష్, ఎంపీఓ నారాయణ, ఏఈఓ మంజుల, నాయకులు అనంతరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఈజీఎస్ టీఏ జీవన్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్యలు హాజరయ్యారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని జిల్లెల్లలో నాటుదాం ఒక చెట్టు– అమ్మ పేరు మీద కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ రాములు, పంచాయతీ కార్యదర్శి తిరుపతిగౌడ్, దేవాలయ చైర్మన్ రవిగౌడ్, భారతి పాల్గొన్నారు.

గిరిజన భవన్‌లో తీజ్ వేడుకలు



నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు



తీజ్ బుట్టలకు నీరుపోస్తున్న గిరిజన యువతి

అచ్చంపేట: పట్టణంలోని గిరిజన భవన్‌లో గురువారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేరమ్మ దేవతకు, సేవాలాల్ మహారాజ్‌లకు గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన యువతులు ఉపవాస దీక్షలతో మొలకల బుట్టలకు మూడు పూటల నీరు పోశారు. గిరిజన సంస్కృతి సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. గిరిజన సేవా సంఘం, ఉద్యోగుల సంఘం, యువజన సంఘం, తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు ఏర్పాటు చేశారు. మంగ్యానాయక్, లచ్చునాయక్, మంత్ర్యానాయక్, ఎస్.బిచ్యానాయక్, కె.రాములు నాయక్, ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలకు అప్పగించొద్దు

నాగర్‌కర్నూల్: మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఏజెన్సీలకు ఇచ్చే ప్రతిపాదలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జి. లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్. సాయిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వం అధ్యయనం చేయాలని సూచించడం సరికాదని పేర్కొన్నారు. ఏజెన్సీలకు అప్పగిస్తే 54 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని కోరారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీపై ఇవ్వాలని విన్నవించారు.

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గురువారం బిజినేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలకు అప్పగిస్తే కార్మికులు నష్టపోతారన్నారు. పీఆర్‌టీయూ నాయకులు సాయిరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

కోడేరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదుపై తహసీల్దార్ విజయ్‌కుమార్ గురువారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటురుగా నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రోజు 20 ఇళ్లను తప్పనిసరిగా సందర్శించి ఓటరు జాబితాలో తప్పొప్పులను సరిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జయలక్ష్మి, ఏఆర్‌ఐ జంబులయ్య, మహేష్, సురేందర్, అంగన్‌వాడీ సిబ్బంది వరలక్ష్మి, శిరీష, నాగమణి, పద్మ, డి లక్ష్మి, దురెడ్డి స్వాతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

రూ.10 వేల విరాళం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆకుతోట అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం గద్వాల జిల్లా ధరూర్ మండలానికి చెందిన బత్తుల చందన్‌గౌడ్, బత్తుల కేశమ్మ జ్ఞాపకార్థమై కూతురు రేవతి రూ. 10 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు లోకేశ్వరయ్యకు నగదు అందజేశారు.

రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలం



కల్వకుర్తిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



వంగూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



కొల్లాపూర్‌లో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ఆర్డీఓ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావు, దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, కమలేశ్వర్‌రావు, తదితరులున్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నిరసన తెలిపారు. మంత్రులకు కూడా రుణమాఫీపై అవగాహన లేదని ఎద్దేవా చేశారు. అనంతరం తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ చైర్మన్ సత్యం, కౌన్సిలర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వంగూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు, కార్యకర్తలతో కలిసి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, స్థానిక మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు నిరసన తెలిపారు. గణేష్‌రావు, నరేందర్‌రావు, సురేందర్, అంజి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ పదర ఎంపీడీఓ కార్యాలయంలో అధికారికి మాజీ జెడ్పీటీసీ రాంబాబునాయక్ వినతి పత్రం అందజేశారు. ఆంక్షలు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని కోరారు.

చారకొండ: అంబేద్కర్ సర్కిల్‌లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏదిరే రవీందర్ రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రాపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. తన్నీరు రామకృష్ణ, సవారి జంగయ్య, బాలయ్య ఉన్నారు.

మన్ననూర్: అంబేద్కర్ కూడలిలో బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. మాజీ సర్పంచ్ నేనావత్ శ్రీరామ్, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు ప్లకార్డులు పట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు, గోపాల్ రెడ్డి, శేఖర్, శ్రీనివాసులు, నరేష్ పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసనలు చేపట్టి ర్యాలీ నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కేటీ తిర్పతయ్య, రానోజీ, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

బల్మూర్: మండల కేంద్రంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ నర్సయ్య యాదవ్, నాయకులు వెంకటయ్య, నాగయ్య, చందు, మహ్మద్ సుల్తాన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): బిజినేపల్లి, తిమ్మాజిపేటలో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహాగౌడ్ డిమాండ్ చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. నాయకులు కౌన్సిలర్లు మనుప్రసాద్, రమేష్‌రావు, అమీనోద్దీన్, కుత్బుద్దీన్, శంకర్‌మాదిగ, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: అంబేద్కర్ చౌరస్తా నుంచి నెహ్రూ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నెహ్రూ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఆర్‌ఐకి వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మన్ హనుమంతురావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు రమేష్, లక్ష్మమ్మ, మాధవరెడ్డి, కువలేశ్వర్‌రెడ్డి, ప్రమోద్ పాల్గొన్నారు.

ఊర్కొండ: మండల కేంద్రంలో ఆందోళన నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వీరారెడ్డి, గిరి నాయక్ పాల్గొన్నారు.



తెలకపల్లిలో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొట్టుకుపోయిన పంటలు, రోడ్లు

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్, సింగవరం, జటప్రోల్ గ్రామాల్లో జూరాల కాల్వ ద్వారా వరద నీరు అధికంగా రావడంతో సింగోటం గ్రామంలోని చెరువు తెగింది. దీంతో చెరువు కింద ఉన్న పంటలు నీటిలో కొట్టుకుపోయాయి. సింగవరం గ్రామానికి ప్రధాన రహదారి కూడ చెరువులోని నీటి ఉద్రిక్తత పెరగడంతో కాల్వ తెగడం వల్ల రోడ్డు మొత్తం పూర్తిగా తెగిపోయింది. దీంతో గ్రామాలకు కూడ రాకపోకలకు అంతారాయం ఏర్పడింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, రోడ్డుకు వెంటనే మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాడూరు: మూడు రోజుల కిందట కురిసిన వర్షాల తాకిడికి మండలంలోని ఐతోల్ నుంచి బలాన్‌పల్లికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అంచుభాగం కోసుకుపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు.



సింగవరంలో పొలంలో నిలిచిన వర్షం నీటిని చూస్తున్న రైతు



కోసుకుపోయిన ప్రధాన రహదారి

బ్యాంకుల్లో బారులు తీరిన రైతులు



ఏపీజీవీబీ బ్యాంకు ఎదుట రైతులు

పెద్దకొత్తపల్లి: ఇటీవల ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంతో మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకుకు గురువారం రైతులు బారులు తీరారు. వివిధ గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బ్యాంకుతో పాటు బ్యాంకు పరిసర ప్రాంతాలలో రైతులు గుమిగూడారు. మండల కేంద్రంలోని ఏపీజీవీబీ బ్యాంకులో 2230 మంది రైతులకు రుణమాఫీ అయ్యింది. బ్యాంకులో 5600 మంది రైతులు రుణాలు పొందారు. కొంతమంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో రైతులు వివరాలు తెలుసుకునేందుకు అధిక సంఖ్యలో రావడంతో బ్యాంక్ ప్రాంగణం రైతులతో కిటకిటలాడింది.

ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న కళాకారులు

బల్మూర్: మండల కేంద్రంలో ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా కళాకారులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మద్దెల అర్జున్, గౌరవ అధ్యక్షుడు సామకృష్ణయ్య, రేపల్లి బాబు, పూజ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గెల్వాలాంబమాత విగ్రహ ప్రతిష్ట



వంగూరు: మండల కేంద్రంలోని మల్లు అనంతరాములు కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం గెల్వాలాంబమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వేదమంత్రోచ్ఛరణాలు, భాజాభజంత్రీల మధ్య ధ్వజస్తంభ, అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డితోపాటు గ్రామస్తులు భీమయ్య, రంజిత్, ఐదమయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడిని ఆదుకోవాలి

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి తండాకు చెందిన రమేష్‌నాయక్‌పై అదే తండాకు చెందిన కృష్ణానాయక్ దాడి చేయడంతో రమేష్‌కు రెండు చేతులు విరిగిపోయాయని బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నాయకుడు జైపాల్‌రెడ్డి కోరారు. గురువారం తండాలో బాధితుడిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాలుగు రోజుల కిందట రమేష్‌నాయక్ కూలి డబ్బుల కోసం కృష్ణానాయక్ ఇంటికి వెళ్లాడని దీంతో ఇంటికి వచ్చి డబ్బులు అడుగుతావా అంటూ ఆగ్రహంతో దాడి చేశాడు. రమేష్‌నాయక్ రెండు చేతులు విరిగిపోయాయని పని చేయలేని స్థితిలో ఉన్నాడని వాపోయారు. పోలీసులు పూర్తిగా విచారించి బాధితుడికి న్యాయం చేయాలని కోరారు.

అనాథలకు అన్నదానం



మన్ననూర్: శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టు భూగర్భ విద్యుత్ ప్రాజెక్టులో 2020లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన మోహన్‌కుమార్ జ్ఞాపకార్థం ఆయన మేనల్లుడు శ్రీనివాస్ రావు లెనిటీ వృద్ధాశ్రమంలో అనాథలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. లెనిటీ ఫౌండేషన్ నిర్వాహకులు ఎంఏ ఖాదర్, వృద్ధులు, పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు

వెల్దండ: బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు వస్తుందని ఎంపీడీఓ సత్యపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఎంపీఓ సునీత, ఆయా గ్రామ కార్యదర్శులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పెద్దకొత్తపల్లి నుంచి వెల్దండకు బదిలీపై వచ్చిన ఎంపీఓ లక్ష్మణ్‌తో పాటు ఆయా గ్రామాలకు చెందిన కార్యదర్శులు బదిలీపై వెళ్లిన వారిని సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రేవంత్‌రెడ్డి, కార్యదర్శులు గిరి, ఫయాజ్, నందకిశోర్, సైదమ్మ, మంజుల, స్వప్న, తదితరులు ఉన్నారు.

ఏఓగా తనూజరాజు

చారకొండ: మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం ఏఓగా తనూజరాజు బాధ్యతలు స్వీకరించారు. గతంలో వంగూరు వ్యవసాయ అధికారిగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వచ్చారు. మండల కేంద్రంలో ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న చిన్న హుస్సేన్ కొల్లాపూర్ మండలానికి బదిలీ అయ్యారు.